❖•❖•❖ 14 ❖•❖•❖

# కయప యెదుట క్రీస్తు

*"యేసును పట్టుకొనినవారు ప్రధానయాజకుడైన కయప యొద్దకు ఆయనను తీసికొనిపోగా, అక్కడ శాస్త్రులును పెద్దలును కూడియుండిరి" (మత్తయి 26:57).*

అన్న యేసును ప్రశ్నించుట ముగిసిన తరువాత, అతడు ఆయనను తాత్కాలిక ప్రధాన యాజకుడైన కయప యొద్దకు పంపించాడు (యోహాను 18:24). "ప్రధాన యాజకుని ఇల్లు" (లూకా 22:54) బహుశ అన్న తీర్పు తీర్చుచుండిన గదికి సమీపములో నుండిన విశాలమైన గదియై యుండును. యూదుల మహా సభ సభ్యులు సమావేశము కావలెనని కయప పిలుపునిచ్చాడు శాస్త్రులలోను పెద్దలలోను కొందరు అప్పటికే కయప ఇంటి యొద్దకు వచ్చియున్నారు. గనుక యేసును ప్రశ్నించుటలో కయపతో సహకరించుటకు వారు సిద్ధముగా నుండిరి (మత్తయి 26:57).

యేసును గూర్చిన ముందస్తు తీర్పు పెందలకడనే ఏర్పాటుచేయబడిన ఈ సమావేశములో

తీర్చబడును, అప్పుడు యూదుల మహా సభ ఒక అధికారపూర్వక న్యాయస్థానతీర్పును అదే రోజున పగలు నిర్వహింపబడనై యుండిన తరువాతి నిండు సభా సమక్షములో విడుదలచేయును, ఆ అధికారపూర్వక ప్రకటన తరువాత, ఆ తీర్పుతో ఆయన ఏకీభవించి యేసును సిలువ మరణమునకు అప్పగించవలెనను వినతితో, రోమా పరిపాలకుడైన, పిలాతు నొద్దకు యేసు పంపబడును. మరణదండనను అమలు చేయక మునుపు పౌర సంబంధమైన అదే తీర్పును యూదీయ తీర్పుగా పరిగణించునట్లు ప్రభుత్వ న్యాయ స్థాన తీర్పుకు ముందుగా పౌర సంబంధ తీర్పు ఇవ్వబడవలెనని రోమా ప్రభుత్వము కోరినది.

నిస్సందేహముగా, అన్న మరియు కయప, యేసు సిలువ మరణము నొందునట్లు కొంత కాలము వారి కార్యనిర్వాహణాధికార అధికారమంతటిని వినియోగించుకొన్నారు. యేసు యొక్క ఇహలోక పరిచర్య సమయములో, ఆయన పట్ల యూదులకుండిన ద్వేషభావము అంతకంతకు అధికమైనది. దేవాలయములోని వారి వ్యాపార ప్రవృత్తులను ఆయన ఖండించినప్పటి నుండి (యోహాను 2:13-22), ఈ ద్వేషభావాన్ని అన్న మరియు కయప ఖచ్చితముగా మండే మంటపై ఆజ్యంపోసినట్లు రెచ్చగొట్టి దానిని ప్రోత్సహించి యుందురు. యెరూషలేములో ఆయన తీర్పులకు రెండు సంవత్సరముల క్రితం, బేతెస్థ కోనేరు యొద్ద యూదులు యేసును చంపుటకు ప్రయత్నించారు (యోహాను 5:18). ఈ తీర్పులకు ఒక సంవత్సరము క్రిందట, యేసు యెడల ఉండిన తీవ్రమైన వైరభావము కారణంగా, “మీరెందుకు నన్ను చంపజూచుచున్నారు?” అని యేసు వారినడిగాడు (యోహాను 7:19బి). ఇతర సందర్భములలో యూదులు ఆయనను చంపవలెనని లేక పట్టుకొనవలెనని అనువైన అవకాశము కొరకు వెదకారు (యోహాను 8:59; 10:31, 39). దేవాలయపు బంట్రౌతు ఆయనను పట్టుకొనవలెనని బయటికి వెళ్ళి ఆయనను పట్టుకొనజాలక వట్టి చేతులతోనే తిరిగి వచ్చిన సందర్భములో అన్న మరియు కయపల చెయ్యి కూడ ఉండును (యోహాను 7:32, 44). లాజరు మృతులలో నుండి తిరిగి లేపబడిన తరువాత, యేసు మరణించాల్సిందేనని యూదుల మహా సభ గుర్తించవలెనని కయప సభికులను సూటిగా విజ్ఞప్తి చేసాడు (యోహాను 11:47-53). యేసును ఎలాగైనా వినాశము చేయవలెనని కయప కొంత కాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడని ఈ రుజువు సూచించుచున్నది.

చివరకు, తీర్పు నిమిత్తమై యేసును అతని యెదుటికి తీసికొనివచ్చారు, యేసు తీసికొనిరాబడవలెనని అతడు అత్యధికముగా ఆశించిన స్థలము కూడ ఇదే. కయప యేసుకు విరోధముగా ఏదైన ఒక నేరారోపణను కల్పించవలసిన అవసరము వచ్చినా, ఎలాగైనాసరే యేసును తన పట్టులో నుండి తప్పించుకొననిచ్చేది లేదని అతడు నిశ్చయించుకొన్నాడు.

కయప యెదుట జరిగిన ప్రశ్నోత్తర సందర్భములో యేసు ప్రతిస్పందించిన తీరు, ఆయన తన శ్రమలన్నిటిని ఎదుర్కొన్న విధానముగూర్చి మనకొక చక్కని అవగాహనను ఇచ్చుచున్నది. మనమే శ్రమలను ఎదుర్కొన్నప్పుడు మనము ఎలా ప్రతిస్పందించాలో ఎరుగునట్లు యేసు చేసిన చర్యలను చూపిన వైఖరులను దగ్గరగా విడమర్చి చూడవలెనని పేతురు చెప్పుచున్నాడు. క్రీస్తు, తన తీర్పులలోను సిలువ మరణములోను, మనము “ఆయన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు” మనకు “మాదిరి” యుంచిపోయెనని పేతురు చెప్పుచున్నాడు (1 పేతురు 2:21). యేసు ఆయనకు ఎదురైన తీర్పులలో ప్రతిస్పందించిన విధముగానే మనము కూడ మనకు ఎదురయ్యే తీర్పులలో ప్రతిస్పందించవలెనని పేతురు

వాక్కులు మనకు ఉద్బోధించుచున్నవి. అలాగైతే “కయప ఆధ్వర్యములో నిర్వహింపబడిన ఈ తీర్పులో గల ఎగతాళి యెడల యేసు ఎటువంటి స్ఫూర్తి మరియు మానసిక ప్రశాంతతను ప్రదర్శించాడు?” అని మనము ప్రశ్నించుకొందాము.

*ఆశ్చర్యమును కలిగించు విధముగా, దురవస్థకరమైన ఈ అగ్నిపరీక్ష యందంతటను, యేసు ఏ పాపము చేయలేదు.* తమకుతామే విరోధముగా పాపము చేయుచు ఆయనకు విరోధముగా పాపము చేయుచుండినవారి యెడల ఆయన ప్రతిస్పందించలేదు. ఆయన తనను తాను దేవుని, నీతియుక్తముగా తీర్పు తీర్చువాని చేతులకు అప్పగించుకొన్నాడు. ఆయనకు ముందస్తుగానే తీర్పు తీర్చబడినదని యేసు బాగుగా ఎరిగియుండెను. వారు ఆయన మీద మోపిన నిందలకు ఎటువంటి రుజువు లేకుండానే శత్రువులు ఆయనను ఖండించారనియు ఆయనకు ఒక న్యాయసమ్మతమైన తీర్పు ప్రకటించబడుట అసాధ్యమనియు ఆయనకు తెలియును. ఏదిఏమైనా, దేవుడే దాని పరిణామమును నిర్ణయించుటకు ఆయన దేవుని అనుమతించుటకే బద్ధుడైయుండెను.

ఆయన పక్షమున సాక్షము చెప్పు సాక్షులుగాని ఆయన పక్షమున వాదించుటకు న్యాయవాదిగాని యేసుకు లేకుండిరి. ఏదిఏమైనా, దేవుని కుమారుడైయుండిన ఆయన, వారి దురుద్దేశములను ఒకే ఒక మాటతో జయించగలిగియుండెను. ఒక్క క్షణములో, పాపిష్ఠియైన ఈ ప్రజలనందరిని చెల్లాచెదరు చేయగలిగియుండెను, కానీ వారు చేయగోరిన దానిని చేయునట్లు వారిని అనుమతించుటకే ఆయన ఎన్నుకొన్నాడు. అప్పుడప్పుడు, పౌలు ఉదాహరణముగా చూపించినట్లు, ఒక వ్యక్తిగత సమర్థనా ప్రతివాదమును చూపించుట సముచితమైనదై యుండును (అపొస్తలుల కార్యములు 22; 23; 26); కానీ యేసు అలా ప్రతిస్పందించుటకు ఇది తగిన సమయమని ఎంచలేదు.

కయప కుయుక్తితో రూపొందించుకొని వేసిన ప్రశ్నల నడుమ, యేసు పాపము చేయలేదు. ఆయన తనను ప్రశ్నించినవారి స్థాయికి తగ్గలేదు లేక బాధను కలిగించు వారి కఠిన మాటలకు సరిపడునట్లు బదులు పలుకలేదు.

*ఇంతేగాక, ఈ తీర్పులయందంతటను, ఆయన నోట ఏ కపటమును కానరాలేదు.* అనుచితమైన ప్రజల అర్థపర్థంలేని నేరారోపణలకు సత్యమును సాగదీయుట ద్వారా గాని అసత్యములను ఆధారంచేసుకొని ఏదైన ఒక నేరమును కల్పించుట ద్వారా గాని సమాధానమిచ్చుటకు ఆయన ప్రయత్నించలేదు. ఆయన వారి యెదుట మౌనముగా నిలబడియుండి ఆ మౌనమే వారి దుష్ట ప్రవర్తనను మరియు అదుపుతప్పిన అభినివేశమును గద్దించునట్లు చూచుకొన్నాడు.

యేసు నిందితుడే యని నిర్ధారణ చేయగల రుజువుని కనుగొనుట అన్నకు మరియు కయపకు మొదటి సవాలై యుండెను. ఆయనను మరణమునకు అప్పగించవలెనని వారు అదివరకే నిశ్చయించుకొన్నారు, కానీ వారి తీర్పుకు ఆలంబనమిచ్చు రుజువు వారికి కావలసివచ్చినది. పక్షపాతముతో కూడిన వారి న్యాయస్థాన తీర్పును రూఢిపర్చుటకు వారు ఏదో ఒక మార్గమును కనుగొనవలసియుండినది. యేసుకు విరోధముగా సాక్షమివ్వబడగల ఏ విషయమైనా దొరకునేమో అని వారి సిబ్బంది అంతా మతిస్థిమితములేని వారి వలె వెర్రిగా వెదకవలసి వచ్చినది. అటువంటి అంశమేదియు వారికి అందుబాటులో లేనందువలన, వారు కల్పింపబడిన రుజువు వైపునకు తిరిగారు. అందునిమిత్తము అవసరమై యుండిన అబద్ధ

సాక్షులను కూడ తెచ్చారు. వేదముపై చెయ్యివేసి శపథము చేసిన తరువాత, అధికారుల నీచస్తుతిచేత దయపొందిన ఈ అపవాది సాక్షులు మన రక్షకునిపై ఆపవాదాలు మోపుటకు ఆరంభించారు. యేసు వారితో వాదోపవాదము చేయలేదు. ఆయనకు అది అసలే అవసరము లేకుండినది. సాక్షులు చెప్పిన సాక్ష్యములలో పొంతనలేకుండినది. పరస్పరము విరుద్ధముగాను సరిగానివిగాను ఉండిన వారి వివరములనుబట్టి వారి స్వంత సాక్ష్యములనే వారు కొట్టిపారేశారు.

మత్తయి ఇలా నివేదించుచున్నాడు,

> ప్రధానయాజకులును, మహా సభవారందరును, యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా అబద్ధసాక్ష్యము వెదకుచుండిరి కాని అబద్ధసాక్ష్యులనేకులు వచ్చినను సాక్ష్యమేమియు దొరకలేదు. తుదకు ఇద్దరు మనుష్యులు వచ్చి – "వీడు దేవాలయమును పడగొట్టి, మూడు దినములలో దానిని కట్టగలనని చెప్పెననిరి" ప్రధానయాజకుడు లేచి – "నీవు ఉత్తరమేమియు చెప్పవా? వీరు నీమీద పలుకుచున్న సాక్ష్యమేమని అడుగగా" యేసు ఊరకుండెను (మత్తయి 26:59–62).

యాజకులును మహా సభ సభ్యులును యేసు చెప్పిన ఈ మాటలను మరియు ఈ మాటలలో ఉండిన ఉద్దేశాలను అపార్థం చేసుకొన్నారు. వారు ఆయన మాటలను వాటి సందర్భము నుండి వేరుచేయుచు అవి వారి దేవాలయమునకు ఒక బెదిరింపుగా ఉన్నాయని చెప్పుట ద్వారా వాస్తవములను తప్పుగా వర్ణించారు, కానీ వాస్తవమునకు ఆ మాటలు ఆయన పునరుత్థానమును తెలియజేయుచున్నవని చెప్పుటకు వారికి ఒక అలంకారిక దృశ్యము నివ్వవలెనని యేసు ఉద్దేశించాడు.

ఈ మూర్ఖపు సాక్షులను సరిదిద్దుటకు యేసు ప్రయత్నించలేదు. వారు ఒక నమ్మశక్యమైన వ్యాజ్యమును కల్పించవలెనని తొక్కిసలాడుచుండగా ఆయన ప్రశాంతముగా గమనించాడు. వారి ఉన్నతమైన ప్రయాసములు గందరగోళముగాను మరియు కలగాపులగముగా చేయబడినదిగాను, యేసు నేరస్తుడని రుజువు చేయుటకు అప్పటికప్పుడు ఏర్పాటుచేయబడి వారనుకున్న న్యాయమును సమకూర్చుటకు ఎందుకూ పనికిరాని వాదముగాను పరిణమించినవి. చట్టములు అతిక్రమింపబడినవి, నిందితుల హక్కులు నిర్లక్ష్యము చేయబడినవి, మరియు ఒక అమాయక నిర్దోషిని అబద్ధ సాక్ష్యములతో దోషి యని నిర్ధారణ చేయుటకు న్యాయస్థానము వెదకినది. ఈ విషమ పరిస్థితులన్నిటిలోను, ఆయన యెడల న్యాయరాహిత్యమైనవారి ద్వారా చూపించబడుచుండిన ఆనాదరణనంతటిని యేసు విధేయతతో దేవునికి సమర్పించుకొన్నాడు.

*పైపెచ్చు, ఆయన దూషింపబడినప్పుడు, ఆయన బదులు దూషించలేదు.* దేవుని తోడని ఆయనకు చెప్పినప్పుడు, ఆయన గౌరవముతోను సత్యముతోను సమాధానమిచ్చాడు. వాక్యభాగము ఇలా చెప్పుచున్నది,

> అందుకు ప్రధాన యాజకుడు ఆయనను చూచి – "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను" అందుకు యేసు – "నీవన్నట్టే. ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని చెప్పెను" (మత్తయి 26:63బి, 64).

ఈ గడియ ఆయన ఎవరై యుండెనో లోకమునకు బయలుపర్చుకొను గడియయై యుండవలెనని యేసు ఎన్నుకొన్నాడు. కయప యెదుట నిర్వహింపబడుచుండిన తీర్పులో అవకాశము రానంతవరకు ఆయన తన దైవత్వమును గూర్చిన సత్యమును బహిరంగముగా పేర్కొనలేదు. యేసు తన గుర్తింపు గూర్చిన సత్యమును తెలియజెప్పవలెనని కయప దేవుని తోడని ఆనబెట్టి ఆయనను అడిగినప్పుడే, ఆయన తెలియజెప్పాడు. యేసు తన దైవత్వమును ధ్రువీకరించుట మాత్రమేగాక, సమయము వచ్చినప్పుడు, ఆయన చెప్పిన సత్యము యొక్క సత్యసంధత్వమును రుజువుచేయు ఒక ప్రవచనమును కూడా చేర్చాడు.

ప్రధానయాజకుడు అల్లకల్లోలంగా ఆందోళనను సృష్టించు చేష్టలను నిందలను ఉపయోగించుటకు పాల్పడినప్పుడు సహితము, ఆయన తన పరిస్థితులనన్నిటిని దేవుని హస్తములలో పెట్టవలెనను తన సంకల్పము పట్ల విశ్వసనీయముగా ఉండెను. అతనికి ఎటువంటి రుజువైనను లేదని ప్రధాన యాజకుడు గ్రహించినప్పుడు, నిరాశపూర్వక తెగింపుతో వేరొక నింద మోపాడు. ఘోరమైన దేవదూషణలో తానే నిమగ్నమైపోయి, యేసు, దేవుని కుమారుడు. తన తండ్రికి విరోధముగా దేవదూషణ చేసాడని, ప్రధాన యాజకుడు యేసుపై ఆరోపించాడు, వాక్యభాగము ఇలా చెప్పుచున్నది,

> ప్రధానయాజకుడు తన వస్త్రము చింపుకొని – "వీడు దేవదూషణ చేసెను; మనకిక సాక్షులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణ మీరిప్పుడు విన్నారు; మీకేమి తోచుచున్నదని" అడిగెను. అందుకు వారు – "వీడు మరణమునకు పాత్రుడనిరి" (మత్తయి 26:65, 66).

దీనంతటికి యేసు ఎలా ప్రతిస్పందించాడు? వారు ఆయనను దూషించారు గనుక ఆయనను నిందించుచుండిన వారిని ఆయన దూషించాడా? వారు ఆయనను ఖండించిన కారణమునుబట్టి ఆయన వారిని శపించాడా? లేదు, ఆయన ఈ పనులలో దేనికినీ పూనుకొనలేదు. ఆయన వారి యెదుట నీతికి సారాంశముగా నిలబడియుండినాడు. తలంపునకు సాధ్యమైన ఘోరాతిఘోర పాపముతో నేరారోపణ చేయబడినప్పుడు, ఆయన ఏమియు మాటలాడలేదు! ఎప్పుడైనా మాటలాడబడని అత్యంత యథార్థమైన మాటల యెడల, యేసు పరలోకము నుండి పంపబడెనను దైవికమైన సత్యము యెడల, వారు ఎగతాళిగా నవ్వారు. వారు ఆయన మాటల గూర్చి గాని ఆయన యెడల గాని వారికిష్టమైనది చేయవచ్చునని యేసు అణకువతో వారిని అనుమతించాడు.

*ఆయన శ్రమనొందుచుండగా, ఆయన ఎటువంటి బెదిరింపులు పలుకలేదు.* ఆయన క్రీస్తని యేసు సాక్షము చెప్పిన దాని గూర్చి కయప చేసిన దుష్ప్రచార పరంపర తరువాత, ఆయనను నిర్బంధములో ఉంచినవారు హేళన చేయుటకును నిర్దాక్షిణ్యముగా బాధించుటకును మొదలుపెట్టారు. మరొకసారి, మనము యేసు యొక్క దివ్యమైన వ్యక్తిత్వమును చూచుచున్నాము. దుర్మార్గులైన మతసంబంధ నాయకులును, క్రూరులును, నిర్దాక్షిణ్యమైన సైనికులును ఆయనను అవమానపరచుటకేనని అపార్థము చేసుకొనుటకు ఎడమేలేని ప్రయత్నముతో ఆయనను కొట్టుటకు ఆయన అనుమతించాడు. ఆయన ఉమ్మి వేయబడుచు చెంపల మీద కొట్టబడుచుండగా, మన రక్షకుడు తనను తాను దేవుని సంరక్షణకు అప్పగించుకొన్నాడు. "అప్పుడు వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి, ఆయనను గుద్దిరి; కొందరు ఆయనను అరచేతులతో కొట్టి – క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి"

అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 26:67, 68). ఆయన వెనుదిరుగ లేదు లేక ప్రతీకారము తీర్చుకొనలేదు. ఆయన పిడిగుద్దుకు బదులు పిడిగుద్దే జావాబని వారిని కొట్టలేదు లేక అవమానపర్చువారు అవమానముకే అర్హులని వారిని అవమానపర్చలేదు. ఈ తీవ్రమైన పెనుగాలిలో దేవుడే ఆయనకు అండయైన బండగాను ఆశ్రయముగాను ఉండవలెనని యేసు ఎన్నుకొన్నాడు.

❖◆❖◆❖

*యేసు, దేవుని గొఱ్ఱెపిల్లగా, మౌనముగాను, విధేయతతోను, మరియు భయభక్తులతోను శ్రమలననుభవించాడు. యెషయా ప్రవచనము ప్రకారమైన పటమును విశ్వసనీయముగా నెరవేర్చినప్పుడు ఆయన ఆత్మవిశ్వాసంతోను గంభీరమైన ఘనతతోను సహించాడు: "అతడు దౌర్జన్యము నొందెను. బాధింపబడినను, అతడు నోరు తెరవలేదు; వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు, బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు, అతడు నోరు తెరువలేదు" (యెషయా 53:7).*